క్లుప్తంగా

క్రీడాకారులను అభినందించిన మంత్రి



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల చైనాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన పి.పవిత్రాచారి, పి.సత్యజిత్‌చారి సత్తా చాటారు. ఈసందర్భంగా క్రీడాకారులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం అభినందించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పరిపూర్ణచారి పాల్గొన్నారు.

ఉషారాణి సేవలు మరువలేనివి..

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయురాలిగా ఉషారాణి విద్యార్థులు, విద్యారంగం అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని డీఈఓ సోమశేఖరశర్మ కొనియాడారు. ఖమ్మంలో జరిగిన ఉషారాణి వర్ధంతి సభలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించాక డీఈఓ మాట్లాడారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు, నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, విజయ, అమృత్‌కుమార్, వీరయ్య, కందుల వెంకట్, నర్సయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్రచారి

నేలకొండపల్లి: ఈనెల 17న విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సంఘం మండల కన్వీనర్ తుడిమళ్ల ఉపేంద్రచారి పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తకొత్తూరులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే ఈ వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పాగర్తి సుధాకర్, తోగాటి నాగాచారి, కంది రామకృష్ణచారి, మల్లెల నాగబ్రహ్మాచారి, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' అందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులందరికీ గృహలక్ష్మి పథకాన్ని అందించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యాన మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు అశోక్ మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంలో పేదలకు ఇళ్లు మంజూరు చేసి.. కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీలక్ష్మి, నాయకులు ఆజాద్, కంకణాల శ్రీను, రవీందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'గడప గడపకూ కాంగ్రెస్'



డివిజన్ నాయకులు, స్థానికులతో విజయ్‌బాబు

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం కొనసాగుతోంది. కాగా నగరంలోని 52వ డివిజన్‌లో ప్రచార కార్యక్రమాన్ని పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు మంగళవారం సాయంత్రం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	ఓఎంజీ–2 (హిందీ)
శ్రీనివాస	జవాన్
సుందర్	తురుమ్‌ఖాన్‌లు

– ఖమ్మంగాంధీచౌక్

రూ.33 కోట్లు.. 6.5 కిలోమీటర్లు



శరవేగంగా సాగుతున్న ఖమ్మం - కామంచికల్ రోడ్డు విస్తరణ పనులు

- శరవేగంగా ఖమ్మం–కామంచికల్ డబుల్ లేన్ పనులు
- ఎన్నెస్పీ అండర్ పాస్ వద్ద 10 మీటర్ల నిడివితో బాక్స్ తరహా నిర్మాణం
- ఇప్పటికే 25శాతానికి పైగా పనులు పూర్తి

ఖమ్మంఅర్బన్: నిత్యం రద్దీగా ఉండే ఖమ్మం వయా కామంచికల్ డోర్నకల్ లింక్ రోడ్డుకు మహర్దశ పట్టింది. ఇప్పటి వరకు ఉన్న సింగిల్ రోడ్డుతో.. ఎదురుగా వాహనాలు వస్తే కష్టంగా రోడ్డు మార్జిన్ దిగి రాకపోకలు సాగించాల్సి వచ్చేది. అదనుగా గుంతలు పడితే ప్రయాణం పెద్ద ప్రయాసే.ఈ నేపథ్యాన ఆర్‌అండ్‌బీ నుంచి ప్లాన్ వర్క్ ఫండ్ ద్వారా డబుల్ రోడ్డు నిర్మాణం కోసం గత ఐదు నెలల క్రితం రూ.33 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నాటి నుంచి రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 25 శాతం మేర పనులు అయినట్లు ఇంజనీరింగ్ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యే కృషితో నిధులు..

ఖమ్మం నగరం, రఘునాథపాలెం, ఖమ్మంరూరల్ మండలాలను అనుసంధానం చేస్తూ ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కాగా.. ఖమ్మం నుంచి దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్ వరకు ఆరున్నర కిలోమీటర్ల వరకు ఈ రోడ్డు నిర్మాణం కొనసాగుతుంది. నిత్యం ఖమ్మం నగరంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు, పాఠశాలలు, కాలేజీలు, పలు ప్రాంతాల్లో పనులు చేసే కార్మికులు, ఉద్యోగులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుండడంతో ఖమ్మం నుంచి డోర్నకల్ వరకు ఈ లింక్ ప్రధాన రోడ్డు మార్గంగా ఉపయోగపడనుంది. రెండు జిల్లాలకు కలిపే ఈ రోడ్డు పూర్తయితే రవాణా పరంగా మంచి రోజులు వచ్చినట్టేనని ఆయా గ్రామాల ప్రజలు చెపుతున్నారు.

అర కిలో మీటర్‌కు రూ.20 కోట్లు..

ప్రస్తుత రోడ్డు నిర్మాణం ఆరున్నర కిలోమీటర్లు కాగా.. అందులో ఓ చోట వేస్తున్న అర కిలోమీటర్ దూరానికే అత్యధికంగా రూ.20 కోట్లకుపైగా నిధులు ఖర్చవుతున్నాయి. అర కిలోమీటర్ నాలుగులేన్ల రోడ్డు విస్తరణతో పాటు నగరం చెంతనే ఉన్న సాగర్ ప్రధాన కాల్వ క్రాసింగ్ వద్ద కాల్వ అండర్ పాస్ ద్వారా ఈ రోడ్డు ఉంది. అక్కడ రోడ్డు వెడల్పుతో పాటు, గతంలో నిత్యం గుంతలు పడి, నీరు లీకుతో రవాణా పరంగా ఇబ్బందికరంగా ఉండేది. ఈ నిర్మాణం ద్వారా 10 మీటర్ల వెడల్పుతో కూడిన బాక్స్ టైప్‌లో అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం భూసేకరణ సైతం చేసినట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారి తెలిపారు. దీని కోసమే మొత్తం వ్యయంలో ఖర్చు పెరిగిందంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల కాలపరిమితి ఉన్నా ఐదు నెలల్లోనే 25 శాతం మేర పనులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. సాగర్ కాల్వ అండర్ పాస్ వద్దనే ఎక్కువ రోజులు పనులు జరిగే అవకాశం ఉంది.

రవాణాపరంగా మేలు..



జిల్లా కేంద్రం నుంచి తమ గ్రామానికి ఉన్న ప్రధాన లింక్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించడం ద్వారా రవాణా పరంగా ఎంతో మేలు జరుగుతుంది. ఊరు పుట్టిన దగ్గర నుంచి సింగిల్ రోడ్డు, గుంతల రోడ్డుతో నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. డబుల్ రోడ్డుతో తమ కష్టాలు తీరుతాయి.

– ఎం.వెంకటమరమణ, సర్పంచ్, కామంచికల్

ఇబ్బందులు తగ్గుతాయి..



ఖమ్మం నుంచి కామంచికల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు రాకపోకలకు సాగించడానికి ఇబ్బందులు తగ్గుతాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు బాగా రద్దీగా ఉంటున్నందున కానీసం కామంచికల్ చివరి వరకైనా రోడ్డును పొడిగించి, పూర్తి చేస్తే బాగుంటుంది.

– ఎ.కళింగరెడ్డి, ఎంపీటీసీ, కామంచికల్

రైతుల సంక్షేమానికి కృషి

ఖమ్మంఅర్బన్: రైతుల సంక్షేమం కోసం టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సంఘం కృషి చేస్తోందని చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సందర్భంగా రైతులకు మంజూరైన నగదును ఆయన మంగళవారం అందజేసి మాట్లాడారు. మొదట విడతగా 901 మంది రైతులకు రూ.5.08 కోట్ల మేర రుణమాఫీ కాగా, ఇప్పటివరకు 692మందికి రూ.4.51కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవి, సంఘం ఉద్యోగులు పాల్గొన్నారు.



రైతులకు నగదు అందజేస్తున్న చైర్మన్

డీఈఓకు టీపీటీఎఫ్ నాయకుల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు పెట్టిన అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ నాయకులు డీఈఓ సోమశేఖర శర్మకు విన్నవించారు. మంగళవారం ఈమేరకు డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సంఘం బాధ్యులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్‌లు మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను చూపాలని, మెడికల్ సర్టిఫికెట్లు, స్పౌజ్, ప్రిపరెన్షియల్ కేటగిరీల్లో అవకతవకలు జరగకుండా చూడాలని, సీనియారిటీ జాబితాలను సమగ్రంగా రూపొందించాలన్నారు. అన్ని రకాల సందేహాలను నివృత్తి చేసిన తర్వాతనే ఫైనల్ లిస్టు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం, కీళ్ల నొప్పులతో సతమతం

నేలకొండపల్లి: సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యాన మండల కేంద్రంలోని రెండు వార్డు ప్రజలు అల్లాడిపోతున్నారు. గత ఇరవై రోజులుగా స్థానికులు జ్వరం బారిన పడుతుండగా, పలువురు కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. ఇంకొందరికి శరీరంలో పొక్కులు వచ్చి చర్మం పొట్టులా ఊడిపోతుండగా, ఇంకొందరి ముఖంపై నల్ల మచ్చలు ఏర్పడ్డాయి. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై నేలకొండపల్లి మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు తన దృష్టికి రాలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి కారణాలు గుర్తిస్తామని పేర్కొన్నారు.

గ్రామాల్లో డ్రైడే పనులు



రేగులచలకలో మురుగు నీటిని పారబోస్తున్న కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది

రఘునాథపాలెం: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం డ్రైడే పనులు చేపట్టారు. గ్రామ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఆధ్వర్యాన గ్రామాల్లోని వీధులతో పాటు నివాసాలకు వెళ్లి నిల్వ నీటిని పారబోయించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించడంతో పాటు మురుగు గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా మందు చల్లించడం తదితర పనులు చేపట్టారు.

ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పాలేరు శాసన సభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీపిక మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని 33 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఖమ్మంరూరల్: ప్రతీ రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబు తెలిపారు. మంగళవారం పెదతండా రేషన్ షాపులో కార్డుదారులకు ఈ-కేవైసీపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్డులో పేరు ఉన్న అందరూ ఈకేవైసీ అప్డేట్ చేయించుకునేలా పాలేరు నియోజకవర్గానికి చెందిన రేషన్ డీలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

నిత్య సాధనతోనే మంచి ఫలితాలు

ఖమ్మం స్పోర్ట్స్: శిక్షణా కాలంలో ఆర్చరీ క్రీడాకారులు నిత్యం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చాటొచ్చని ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సాధుల సారంగపాణి తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అసోసియేషన్ పరంగా క్రీడాకారులకు అండగా నిలుస్తామని తెలిపారు. ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్యతో పాటు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవోస్ జిల్లా ప్రచార కార్యదర్శిగా వల్లోజి



శ్రీనివాసరావుకు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం


ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవోస్) అసోసియేషన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా వల్లోజి శ్రీనివాసరావు నియమితులయ్యారు. డీపీఆర్వో కార్యాలయంలో ఏపీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి మంగళవారం నియామకపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయనను ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.కే.ఖాజామియా, పట్టణ అధ్యక్షులు నయీంపాషాతో పాటుట శేషప్రసాద్, సంజయ్, ఉషశ్రీ, సుధారాణి, కృష్ణకుమారి, మంజుల, శారద, లావణ్య, వెంకన్న, రామకృష్ణ, సాదిక్ అలీ, నరేష్, సుమంత్, శంకర్, రాజు అభినందించారు.

నివాళి..

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పట్టణ నాయకుడు ఎస్‌కె.గౌస్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు ఖమ్మం ఖిల్లాలోని మృతుడి స్వగృహంలో మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీ.వై. పుల్లయ్య, ఆవుల అశోక్, శిరోమణి, ఆజాద్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీకి నామినేషన్లు

నేలకొండపల్లి: మండలంలోని చెరువు మాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు సంబంధించి మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. తొలిరోజు మంగాపురంతండాకు చెందిన భూక్యా నాగేశ్వరరావు నామినేషన్‌ను ఎన్నికల అధికారి ప్రసాద్‌కు అందజేశారు. చెరువు పరిధి గ్రామాల్లో 832 మందికి ఓటు హక్కు ఉండగా, మాజీ అధ్యక్షుడు షేక్ ఖాసిం, యడవల్లి చంద్రయ్య ప్యానళ్ల నడుమ పోటీ జరగనుంది. మరోపక్క ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు సీనియర్ సభ్యులు కసరత్తు చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం ఎన్నిక జరగాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం.



నామినేషన్ దాఖలు చేస్తున్న నాగేశ్వరరావు

గణేశ్ మండపాల నిర్వహణకు చేయూత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుడా చైర్మన్

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో ఏర్పాటు చేసే శ్రీ గణేశ్ మండపాల విద్యుత్ వినియోగ చార్జీలు, మైక్ పర్మిషన్ రుసుమును పువ్వాడ ఫౌండేషన్ ద్వారా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చెల్లిస్తారని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం స్థానిక వర్తక సంఘం భవనంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన మండప నిర్వాహకుల సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏసీపీ హరికృష్ణ మాట్లాడుతూ.. గణేశ్ మండపాల ఏర్పాటుకు పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటీ మాట్లాడుతూ.. శ్రీ గణేశ్ మండప నిర్వాహకులకు ప్రభుత్వానికి స్తంభాద్రి ఉత్సవ సమితి వారధిలా బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు స్వామి, కుమారస్వామి, సత్యనారాయణ, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు వెంపటి లక్ష్మీనారాయణ, గంట్యాల విద్యాసాగర్, కీసర జయపాల్ రెడ్డి, కన్నం ప్రసన్న కృష్ణ, అల్లిక అంజయ్య, మూలగుండ్ల శ్రీహరి, పాలడుగు పాపారావు, వేల్పులు సుధాకర్, ఈశ్వరప్రగఢ రామారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటు పనులు షురూ..

ఖమ్మంఅర్బన్: వినాయచవితి సమీపిస్తుండడంతో నగరంలోని పలు చోట్ల మండపాల తయారీ పనుల్లో నిర్వాహకులు నిమగ్నయ్యారు. ఇప్పటికే పలుచోట్ల పనులు మొదలయ్యాయి. భారీ సెట్టింగ్‌లతో మండపాలు నిర్మిస్తుండగా, పలువురు భక్తులు విగ్రహాలను సమకూర్చగా ఇంకొందరు పూజాసామగ్రి ఇచ్చేందుకు ముందుకొస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కాగా, ఎన్నికల సమయం కావడంతో రాజకీయ పార్టీల నాయకులు ఎక్కువ మంది విగ్రహాలు సమకూరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇక పూలు, ఇతర నిర్వహణ వ్యయం కోసం నిర్వాహకులు భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు.

చేనేత, హస్తకళలను ఆదరించండి



చీరలను పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

ఖమ్మంగాంధీచౌక్: చేనేత, హస్తకళలను ఆదరించి ప్రోత్సహించాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్ నూతన బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో శ్రీ కళాభారతి చేనేత, హస్త కళామేళాను మంగళవారం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరతో కలిసి ప్రారంభించిన సందర్భంగా మేయర్ మాట్లాడారు. చేనేత కళాకారుల నైపుణ్యత, సృజనాత్మకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి అనువైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కళా మేళానిర్వాహకుడు ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి, గద్వాల, ధర్మవరం, పట్టు వస్త్రాలు తదితర ఎన్నో రకాల చేనేత వస్త్రాల విక్రయంతో పాటు 200లకు పైగా హస్త కళలు, చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు ప్రదర్శనలు, అమ్మకాలు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ పరిధిలోని 53, 54, 55వ డివిజన్ల పరిధిలోని రోడ్ల పనులకు మంగళవారం నగర మేయర్ పునుకొల్లు నీరజ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రధాన రహదారి జీపీ రెడ్డి స్వీట్స్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రూ.కోటి వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార ముక్తార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ప్రసాద్‌రావు, మోతారపు సుధాకర్, పైడిపల్లి సత్యనారాయణ, ఈఈ కృష్ణాలాల్, డీఈరంగారావు, ఏఈ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీలు బోడ మంగీలాల్ నాయక్, వజ్జా రమ్యలు సూచించారు. మంగళవారం ఈమేరకు తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంపీపీ మంగీలాల్ నాయక్, నేలకొండపల్లిలో రమ్యలు ఆరోగ్య మహిళా కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం ఈ కార్యక్రమం కింద 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళలకు ప్రతీ మంగళవారం 57 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తారని తెలిపారు. నేలకొండపల్లిలో తొలిరోజు 62 మందిని పరీక్షించి అత్యవసర వైద్యం కోసం 10 మందిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. తొలుత నేలకొండపల్లిలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీడీఓ చుంచు శ్రీనివాస్, ఎంపీఓ రాజేశ్వరీ, వైద్యాధికారులు వసుంధర, శ్రావణ్‌కుమార్, రాజేష్, మురళీకృష్ణ, సర్పంచ్ సంజీవయ్య, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: సుబ్లేడులో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

బీఎస్పీ బలోపేతానికి కృషి



నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

ఖమ్మంరూరల్: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, కేంద్ర, రాష్ట్ర పాలకుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేంద్ర సాహు తెలిపారు. మంగళవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా ఏళ్లుగా బహుజనులను చైతన్యవంతం చేస్తూ రాజ్యాధికారం సాధించడానికి ఎందరో నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రతీ పల్లెకు బహుజన సిద్ధాంతాన్ని తీసుకెళ్లి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బి.బాలరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిరియాల నాగరాజు, ల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసుబ్రహ్మణ్య స్వామికి అభిషేక పూజలు


ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో గల శ్రీవేంకటేశ్వర గోశాలలో శ్రీసుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం అభిషేక పూజలు జరిపారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ అర్చకుడు అరుట్ల శ్రీనివాసచార్యులు వివిధ పండ్లరసాలతో అభిషేకం చేసి గోత్రనామ పూజలు చేశారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంలో గల గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు మండలంలోని 18 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా.. వారికి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడలు ఐకమత్యానికి, మానసికోల్లాసానికి దోహదపడతాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం చాలా అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్యాంసన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం జరిగేలా చూడండి

ఖమ్మం సహకారనగర్: రెగ్యులరైజేషన్ ప్రక్రియ సాగుతున్న నేపథ్యాన ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌ను కోరారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, ఇతర అంశాల ఆధారంగా రెగ్యులర్ చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదని తెలిపారు. దీంతో మంత్రి అజయ్‌కుమార్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అఫ్జల్ చెప్పారు. ఈకార్యక్రమంలో జేపీఎస్‌లు వినోద్‌కుమార్, మహమ్మద్, ఫజల్, కిరణ్, రాధిక తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు